ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు

నిర్బంధం నడుమ ఉక్కు సమ్మె సక్సెస్

- స్టీల్‌ప్లాంట్‌లో పోరాటాన్ని ఉధృతం చేసిన కాంట్రాక్టు వర్కర్లు
- అరెస్టులకు దిగిన ప్రభుత్వం
- కార్మికులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తున్న బస్సును అడ్డుకున్న సహచర కార్మికులు
- ప్లాంట్ గేటు నుంచి కూర్మన్నపాలెం వరకూ భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఉక్కునగరం : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, పర్మినెంట్ కార్మికులపై, కార్మిక సంఘాల నాయకులపై సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో కక్ష సాధింపు చర్యలకు దిగడం వంటి చర్యలను నిరసిస్తూ, ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం తలపెట్టిన సమ్మె జయప్రదమైంది. వారికి ప్లాంట్‌లోని పర్మినెంట్ కార్మికుల మద్దతు లభించింది. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ కార్మికులు వెనక్కు తగ్గలేదు. ఉదయం నుంచి రాత్రి వరకూ సమ్మెను కొనసాగించారు. ర్యాలీలు నిర్వహించారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద ఆందోళన చేపట్టారు. సమ్మె నేపథ్యంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న జెఏసి నాయకులు

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల

తొలగింపులు ఆపాలి

- రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి
- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి నాయకుల డిమాండ్
- స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా నగరంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపేయాలని, కార్మికుల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని, రాష్ట్ర పోలీసులను ప్లాంట్ నుండి వెనక్కు రప్పించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా జెఏసి ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రదర్శన, సభ జరిగాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని, కార్మికుల మిగతా 2లో..

ప్రపంచ రికార్డు సృష్టించేలా యోగా డే

వార్త 2లో..

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

వార్త 7లో..

నిర్వాసితులకు అండగా సిపిఎం

వార్త 5లో..

డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) డిప్యూటీ మేయర్‌గా జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు. విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ఆ విషయాన్ని వెల్లడించారు. ఎపి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ద్వారా జరిగింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి కూటమి అభ్యర్థిగా జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి బి.ఫారాన్ని సమర్పించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రతిపాదించగా, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బలపరిచారు. ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరుకాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు కోరం సరిపోయినందున, మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కూటమి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్‌కు పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

1.87 లక్షల ఎకరాల్లో సాగు

- ఖరీఫ్ అంచనాల్లో వ్యవసాయ శాఖ
- రాయితీపై 24 వేల క్వింటాళ్ల విత్తనాలు

ఖరీఫ్‌కు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలు ఖరీఫ్ పంటల సాగుకు పొలాలు సిద్ధం చేసుకొనేందుకు ఉపయోగపడతాయని భావిస్తోంది. వర్షాలతో ఇప్పటికే రైతులు దుక్కులు ప్రారంభించారు. జిల్లా వ్యాపిత ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. పంటల సాగు లక్ష్యాలు తయారుచేసింది. ఖరీఫ్‌లో 1.87 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతుందని అంచనా వేసింది. ఖరీఫ్ సాగులో వరి సాగు అత్యధికంగా వుంది. ఖరీఫ్‌లో 1.87 లక్షల ఎకరాలకుగానూ 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగుకానుంది. 35 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు, 6,732 ఎకరాల్లో నువ్వులు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. సాగు పంటలకు తగినట్లు విత్తన ప్రతిపాదనలు తయారు చేసింది. వివిధ పంటలకు సంబంధించి 24,112 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై రైతుకు సరఫరా చేయనున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 893 క్వింటాళ్లు, వరి విత్తనాలు 23,109 క్వింటాళ్లు, రాగులు రెండు క్వింటాళ్లు, అపరాలు 84 క్వింటాళ్లు, నువ్వులు 20 క్వింటాళ్లు, చిరుధాన్యాలు నాలుగు క్వింటాళ్లు ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, అపరాలు, నువ్వుల పంటలో సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచడానికి నియోజకవర్గాల వారీగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించింది.

ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా చేయనున్నారు. నేషనల్ ఫుడ్ మిగతా 2లో..

ప్రపంచ రికార్డు సృష్టించేలా యోగా డే

విశాఖలో లక్షల మందితో కలిసి ప్రధాని యోగాసనాలు - కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రపంచరికార్డు సృష్టించేలా 11 వ అంతర్జాతీయ యోగా డేను జూన్ 21న విశాఖ జిల్లాలో నిర్వహిం చేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన నిర్వహించనున్న యోగాడే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్నారని ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ యోగా డే కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు 'యోగా మంత్' పాటించాలని, ఈ నెల రోజులు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ జరగాలన్నారు. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్‌ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా ప్రభుత్వం తీసుకుందని, అందువల్ల జూన్ 21 న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో ప్రచారం చేపట్టి ప్రజలను సన్నద్ధం చేసేందుకు నెలరోజుల పాటు ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా యోగాడేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను, డ్వాక్రా మహిళలను, ప్రైవేటు ప్రభుత్వ సంస్థల ఉద్యోగులను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ కె బీచ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి, ప్రజలు పాల్గొనే ప్రాంతాల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్.కె బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు, అదే విధంగా పార్క్ హోటల్ నుండి భీమిలి బీచ్ రోడ్ వరకూ సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్.కె బీచ్, రుషికొండ, స్కూల్స్, క్రికెట్, పోలీస్, స్పోర్ట్స్, నేవీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ యోగా డే విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా జిల్లా స్థాయిలో, మండల, గ్రామ, వార్డు స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు, డ్రోన్స్, తాగునీరు, అల్పాహారం, రవాణా సదుపాయం, వాహనాల పార్కింగ్, శానిటేషన్, టాయిలెట్స్, వాలంటీర్లు ఏర్పాటు, మెడికల్ టీమ్‌ల ఏర్పాటు, అతిధులు ఉండేందుకు ఏర్పాట్లు, సిసి కెమెరాల ఏర్పాటు అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కనీస వేతనాలు ఇవ్వాలి

నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం పోర్టు జెపి ఆఫ్ సోర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ విశాఖ పోర్టు కాంట్రాడ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. సమ్మెలో భాగంగా మంగళవారం పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు విభాగంలో జెపి ఆఫ్ సోర్స్ కాంట్రాక్టు కార్మికులు 8 నెలలుగా పని చేస్తున్నారన్నారు. కనీస వేతనాల జిఒ ప్రకారం వీరికి రూ.23వేలు వేతనం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం రూ.13,695 మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన సుమారు రూ.10 వేలు కార్మికులకు చెల్లించకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రోజుకు 12 గంటలు పని చేయించుకుంటున్నప్పటికీ ఒటి కూడా ఇవ్వటం లేదన్నారు. వీక్లీ ఆఫ్, పండగ, జాతీయ సెలవులు కూడా ఇవ్వటం లేదన్నారు. పనిగంటలు 12 నుంచి 8 గంటలకు తగ్గించాలన్నారు. కార్మికులతో ఈ విధంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఇప్పటికే గత 3 నెలల నుంచి కాంట్రాక్టర్, డిసి, సెక్రటరి, చైర్మన్‌తో సహా అధి కారులందరికీ తెలియజేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. అందువల్లనే ఈ రోజు నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. సమ్మెలో పాల్గొన్న వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీను, తాతబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

1.87 లక్షల ఎకరాల్లో సాగు

సెక్యూరిటీ న్యూట్రిషన్ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) కింద గ్రామ విత్తనాభివృద్ధి పథకం కింద ఎనిమిదేళ్లలోపు వరి విత్తనాలను 305 ఎకరాల్లో అభివృద్ధి చేసేందుకు వివిధ పరిశోధన కేంద్రాల నుంచి విత్తనాలు సేకరించి సరఫరా చేయనున్నారు. ఎంటియు 1224, ఎంటియు 1262, ఎంటియు 1318, బిపిటి 2856 రకపు వరి విత్తనాలు యాభై శాతం రాయితీ లేదా క్వింటాకు రూ.2,200 చొప్పున సరఫరా చేయనున్నారు. ఖరీఫ్‌లో 35,353 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు తయారుచేశారు.

సాగు ప్రణాళిక సిద్ధం

ఖరీఫ్‌లో సాగు ప్రణాళిక సిద్ధం చేశాం. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 29 మంది రైతు డ్రోన్ పైలట్లకు 12 రోజుల శిక్షణ పూర్తయింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా అగ్రిస్టాక్‌చే ఎపి ఫార్మర్ రిజస్ట్రీ ద్వారా ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ సంఖ్య ఆధారంగా రైతుకు సంక్షేమ పథకాలు అందుతాయి. జిల్లాలో 3,03,891 లబ్ధిదారులకుగానూ 2,21,943 మంది రైతులకు ఎపిఎఫ్ఆర్ విశిష్ట సంఖ్యను నమోదుచేశాం.

బి.మోహనరావు,
జిల్లా వ్యవసాయ శాఖాధికారి, అనకాపల్లి

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలి

తొలగింపులను నిలిపివేయాలని పెద్ద పెట్టున నినదించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ అఖిల భారత అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పిన రాష్ట్రంలోని కూటమి నాయకులు నేడు 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తుంటే ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను, పర్మినెంట్ కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం, సస్పెన్షన్ చేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, మీటింగ్‌లు జరపకుండా పోలీసులను పెట్టి అడ్డుకోవడం వంటి చర్యలకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్లాంట్ లోపల సైతం పోలీసులను పెట్టడమంటే కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించే విధంగా, కార్మికుల ఉపాధిని రక్షించే విధంగా దేశవ్యాప్తంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తల్లిబిడ్డల ఎక్స్‌ప్రెస్ కార్మికుల సమ్మెకు కూడా నాయకులు మద్దతు తెలిపారు. జులై 9న జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, వి.కృష్ణారావు, పైడిరాజు, ఎఐటియుసి నాయకులు ఎస్‌కె.రెహమాన్, కాసుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు తిరుపతిరావు, సిఎఫ్‌టియుఎఫ్ నాయకురాలు కె.లక్ష్మి, ఐద్వా నాయకులు బి.పద్మ, వై.సత్యవతి, కొండమ్మ, కె.కుమారి, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్.రాజు, శైలజ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, మేరీ, ఆర్‌పి యూనియన్ నాయకులు మల్లేశ్వరి, సత్య, ఝాన్సీలతో పాటు వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాఖలో వర్షం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగిపొర్లాయి. ఉదయానికి వర్షం తగ్గుముఖం పట్టినా చాలాసేపు ముసురు వాతావరణం కొనసాగింది. మంగళవారం అత్యధికంగా సీతమ్మధారలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మహారాణిపేటలో 38.2, గోపాలపట్నంలో 29.4, భీమునిపట్నంలో 26.2, ఆనందపురంలో 24.6, పెదగంట్యాడలో 18.6, గాజువాకలో 18.6, పద్మనాభంలో 10.4, ములగాడలో 6.2, పెందుర్తిలో 4.8 వర్షపాతం నమోదైంది. విశాఖ రూరల్‌లో 72.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE VITH ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

Between:
Sagi Vikram Represented by its GPA Holder, Uma Raju Sagi ...DHr
AND
K.Srinivasa Rao ...JDR

NOTICE

JDR :
Kunapureddy SrinivasaRao
S/o Late Ankala Rao, D.No.49-54-6/7
B.S. Layout, Seethammadhara,
Visakhapatnam.

పై నెంబరు అమలును వీరి నుండి రావలిసిన డిక్రీసొమ్ము రూ.14,03,414/-లు వసూలు నిమిత్తం సదరు అమలును దాఖలు చెయ్యగా సదరు కేసునందు రూలు 64 నోటీసు మీకు ఎన్ని సార్లు పంపిచిననూ మీకు చేరని కారణంగా యి పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం తే.25-6-2025దీకి వాయిదా అయి ఉన్నది. కావున **తే.25-06-25దీన ఉ.10:30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేవణలు తెల్పగలరు లేనిచో సదరు కేసును మీ పరోక్షమందు తీర్మానించడమగును.

(By Court Order)
L.SATYANARAYANA, Advocate
D.No.10-4-20, Ramachandra Residency, Ramanagar,
Visakhapatnam. Cell : 9440584322
Visakhapatnam
Dt.20-05-2025

IN THE HONOURBALE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E. P No. 255 /2023 in O.S No.10/2011

Between:
Sri Nallamilli Janardhana Reddy ....Petitioner/D. Hr
And:
Mutyala Soma Sekhara Rao ..... Respondent/J .Dr
To
Respondent/J. Dr:
Mutyala Soma Sekhara Rao,
S/o. Suryanarayana Murthy, Business,
Aged 82 years, Residing at Flat No.4,
in 4th Floor, Bay Cathal Apartments,
Pandurangapauram, Visakhapatnam

NOTICE

Please take notice that the above named petitioner/D.Hr filed the above E.P under Order 21 Rule 34 of C.P.C with a prayer to cause the draft sale deed annexed with petition to be served on you together with a notice for your objections (if any) to be made within such time as the court fixes in this behalf and in case of your failure an officer may be appointed to execute the annexed sale deed in favour of petitioner and that the Honorable Court was pleased to order to issue rule 22 notice to you and the same is stands posted to **16-06-2025** for your appearance. Hence, you should appear either in person or through a pleader on the above said date at 10:30 A.M before the above said Honorable court to answer all the material questions, failing which the matter will be heard and determined in your absence as per law.

(By order of the Court)
J.V. RAGHAVENDR RAO,
Advocate, # 8-2-4/1,
Peda Waltair Junction,
Visakhapatnam-17
Visakhapatnam,
Dt. 19-05-2025.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL - CUM - IV ADDITIONAL DISTRICT JUDGE (SC ST COURT) AT VIZIANAGARAM
M.O.P. 503/2018 I.A.27/2025

Between:
Karubhuktha Narayana Rao ....Petitioner
And
Chandaka Suresh and others .....Respondents

R-2: Mandala Kanna Rao, S/o late Narayana, Aged 43 years, Hindu, Auto Owner, Resident of Shiva Shakthi Nagar, Kommadi, Madhurawada, Visakhapatnam.

NOTICE

Please take notice that the above O.P., stands posted to **30.06.2025** for notice to the 2nd respondent. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court.

If you not to appear on the said date the above matter will be decided expartee.

P.A.N. Raju
Advocate for the petitioner
Vizianagaram

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 139 / 2023

బిట్వీన్:
లెక్కల రామలక్ష్మి వగైరాలు . . . వాదులు
అండ్:
లెక్కల వేణుగోపాల్ వగైరాలు ... ప్రతివాదులు
టు:
డి-5: సబ్బవరపు గంగాభవాని, W/o.అప్పలనాయుడు, D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, డో.నెం. 3/79/1, వివేకానందనగర్, Near ఎండాడ పెట్రోల్ బంక్, గీతం పోస్టు, విశాఖపట్నం.
డి-6: బర్ల కృష్ణవేణి, W/o. లేటు రాంబాబు D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, సా॥ పి.తిమ్మాపురం గ్రామం పిఠాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. (ప్రస్తుతం కాకినాడ జిల్లా)

పై నెంబర్ను వాద్లు ప్రతివాదలుపైని పంపకం దావాదాఖలు చేయగా 5@6 ప్రతివాదులుకి సమన్లు సర్వు నిమిత్తం తే:19-6-2025 దీకి దావా వాయిదా వున్నది. అయితే పై నెంబరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ మీరు **తే: 19-6-2025దీ ఉదయం 10-30కి** మీరు స్వయంగా గాని, లాయరుగాని ద్వారా గాని, పై కోర్టులో హాజరుఅయి తెలియపర్చు కోవలెను. లేననియెడలా మీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయడమగును అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

P.PRAKASA RAO
Advocate, Chodavaram
Visakhapatnam.
Cell : 94410 19918
Chodavaram
Dt. 20-5-2025

నోటీసు
గౌరవ కోర్టు ఆఫ్ జడ్జ్ ఫ్యామిలీ కోర్ట్ మరియు 5వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి: విశాఖపట్నం
F.C. O.P. No. (2044) of 2025

మధ్య:-
శ్రీమతి బేత @ కాపు శ్యామల ......పిటిషనర్
మరియు
బేతా లక్ష్మీ వరాహ నర్శింహమూర్తి ...ప్రతివాది కు

బేతా లక్ష్మీ వరాహ నర్శింహమూర్తి తండ్రి సన్యాసి, వయస్సు: 55 సం॥లు, వృత్తి: సెక్యూరిటీ గార్డ్, Aadhar No. 546225480506 Native at H. No at D.No. 1-110-9 Flat No. 203, శ్రీ గణేష్ హైట్స్, గణేష్ నగర్, Beside NIR కాలేజీ, చిన్నాముసీరివాడ, పెందుర్తి. విశాఖపట్నం - 531173. ప్రస్తుత నివాసం : D. No. 32-1-61, బంగారమ్మ తల్లి టెంపుల్ స్ట్రీట్, నాతయ్యపాలెం, విశాఖపట్నం -530012.
పైన పేర్కొన్న పిటిషనర్ మీపై హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13 (1)(1a) & (1b) కింద పిటిషన్ దాఖలు చేశారు.
పైన పేర్కొన్న విషయం 04-07-2025న ఉదయం 10:30 గంటలకు మీ హాజరు కోసం మరియు ఏదైనా ఉంటే ఈ గౌరవనీయ కుటుంబ న్యాయస్థానం మరియు అదనపు జిల్లా న్యాయమూర్తి విశాఖపట్నం ముందు కౌంటర్ కోసం పోస్ట్ చేయబడింది.
కాబట్టి పైన పేర్కొన్న తేదీ మరియు సమయంలో మీరు హాజరు కావాలని మరియు గౌరవనీయ కుటుంబ న్యాయస్థానం-మరియు -5వ అదనపు జిల్లా న్యాయమూర్తి విశాఖపట్నం ముందు ఏదైనా ఉంటే కౌంటర్ ఇవ్వాలని గుర్తుంచుకోండి, మీరు డిఫాల్ట్ చేస్తే పిటిషన్ మీ లేకపోవడంతో విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.

// కోర్టు ఆదేశం ప్రకారం //
సాగర్ల రఘు
MCJ., MSc (Psychology), LLB.
న్యాయవాది
పిటిషనర్ తరపు న్యాయవాది

23లోగా వీధి విక్రయదారుల పేర్లు నమోదు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసి 3వ జోన్ పరిధిలోని వీధి విక్రయదారులు తమ వివరాలను ఈ నెల 23లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మూడవజోన్ కమిషనర్ కె.శివప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మూడవ జోన్ పరిధిలో ప్రస్తుతమున్న వీధివిక్రయదారులతోపాటు కొత్తవారు తప్పనిసరిగా తమ వివరాలను స్థానిక సచివాలయ వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శి వద్ద 23లోగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు వీధివిక్రయదారులకు అందుబాటులోనికి వస్తాయన్నారు. సర్వేలో నమోదైన వారికి గుర్తింపు పత్రంగా వెండింగ్ కార్డు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తారన్నారు. వీధి విక్రయదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కళాకృతుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం చిన్నారులకు జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి ఆధ్వర్యంలో బొమ్మలు, పువ్వులు, పర్సులు వంటి కళాకృతుల తయారీపై శిక్షణనిచ్చారు. శిక్షణ అనంతరం చిన్నారుల తయారు చేసిన వాటిల్లో ఉత్తమమైన వాటికి లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ బహుమతులిచ్చారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. చదరంగం ఆడటంతో మేధస్సు పెంపొందుతుందన్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

పూడికతీత పనులను పరిశీలిస్తున్న జెడ్‌సి అయ్యప్పనాయుడు

ప్రజాశక్తి - తగరపువలస : వర్షంలో మురుగుకాలువల్లో పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. జివిఎంసి 1,2 వార్డుల పరిధిలోని స్థానిక మెయిన్‌రోడ్డు కూడలి, సబ్బివానిపేట, రామన్నపేట, బాలాజీనగర్, నగరపు వీధి ప్రాంతాల్లోని కాలువల్లో పూడికతీత పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడుతో కలిసి జెడ్‌సి బమ్మి అయ్యప్పనాయుడు పరిశీలించారు. నీరు నిలిచే ప్రాంతాలను, అవుట్‌లెను పరిశీలించి, పూడికతీత పనులను పర్యవేక్షించారు. శానిటేషన్ విభాగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే నెలలో రూ.కోటి చోరీ సొత్తు రికవరీ

పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా : బాధితులకు పోగొట్టుకున్న వస్తువుల అప్పగింత

బాధితుడికి రికవరీ చేసిన మొబైల్ అప్పగిస్తున్న సిపి బాగ్చీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏప్రిల్ నెల చోరీసొత్తు రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ గత నెలలో 123చోరీ కేసులు నమోదుకాగా, వాటిలో 98 కేసులను చేధించి, 81 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. చోరీ సొత్తులో రూ.45,78,580 విలువగల వస్తువులు, నగదుతోపాటు రూ. 54.75లక్షల విలువ గల 380 మొబైల్ ఫోన్‌లను కలుపుకుని మొత్తం రూ.1,00,53,580 విలువగల సొత్తును రికవరీ చేసి, మేళాద్వారా బాధితులకు అందజేశామన్నారు. గతనెలలో రికవరీ చేసిన చోరీసొత్తులో 562.045 గ్రాముల బంగారం, 701.775 గ్రాముల వెండి, రూ. 7,84,930 నగదు, 54 ద్విచక్రవాహనాలు, 380 మొబైల్ ఫోన్‌లు, ఒక లాప్ టాప్, నాలుగు ఏసీ యూనిట్లు , 10 బ్యాటరీలు, ఒక టివితోపాటు ఒక మేక కూడా ఉందన్నారు. ఏప్రిల్ నెలలో నగరవ్యాప్తంగా నూతనంగా 482 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, 156 క్రైమ్ అవేర్నెస్ క్యాంపులు నిర్వహించామన్నారు. రాత్రి వేళ గస్తీని మరింత పటిష్టం చేశామన్నారు. నగర అధికారులు రూపొందించిన చాట్‌బాట్ ద్వారా ఇప్పటివరకు రూ.8.63 కోట్ల విలువైన 5,754 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి పోగొట్టుకున్నవారికి అందజేశామన్నారు. విశాఖ నగర పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే, 9490617916 నెంబర్ కు చాట్ బాట్ ద్వారా లేదా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో క్రైమ్ డిసిపి కె. లతామాధురి, క్రైమ్ ఎడిసిపి లక్ష్మణరావు, ఎసిపి మోహన రావు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎన్‌టిఆర్, దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని మంగళవారం దాసరి కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్, దాసరి చిత్రపటాలకు సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్టులు డైరెక్టర్ సన్ మూర్తి, అంతర్జాతీయ క్రీడాకారిణి ఎ.రామలక్ష్మి, సామాజిక సేవకులు శ్యామ్ కుమార్, కామేష్, తిలక్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎన్‌టిఆర్, దాసరి చిత్రాల సినీ గీతాలతో సంగీతవిభావరి నిర్వహించారు. గాయకులు బొమ్మిడి సత్యనారాయణ, మను పల్లా నిర్వహణలో నన్నపనేని మల్లిక, శ్రీదేవి, మాధురి, మీనా కుమారి తదితరులు హుషారైన గీతాలతో అలరించారు. ఎన్‌టిఆర్ అభిమాని కాకినాడకు చెందిన దోణం గంగరాజు ఎన్టీఆర్ డూప్‌గా, బి భుజంగరావు, రాజాం కళాకారుడు వికలాంగుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు పాల్గొని, ఎన్‌టిఆర్, దాసరి సేవలను కొనియాడారు.కార్యక్రమంలో తూరగా సూర్యారావు, డాక్టర్ కొల్లూరు సత్యనారాయణ, మార్గం రమేష్, నఫీస్ ,దండు నాగేశ్వరరావు, కోట సూర్యనారాయణ శాస్త్రి, బాణం గంగరాజు బొట్ట సూర్య ప్రకాష్ చక్రపాణి, రమేష్ యాదవ్ అవార్డులు స్వీకరించారు. ఇటీవల ప్రతిష్టాత్మక కందుకూరి అవార్డు పొందిన నగరానికి చెందిన నాటక రంగ ప్రముఖులు వరే నాంచారయ్య, పిసిఎస్ నాయుడు, కొరటాల ప్రభాకర్‌లను సత్కరించారు, అడవి రాజు పాల్గొన్నారు

ప్రశాంతంగా టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లాలో 97 మందికిగాను కేవలం 18 మంది పరీక్ష రాయగా, 79 మంది గైర్హాజరయ్యారన్నారు. తాను ఆరు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 19 కేంద్రాలను సందర్శించినట్టు తెలిపారు.

ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు

ఓపెన్ స్కూలు పదోతరగతి, ఇంటర్ పరీక్షలు రెండవ రోజు ప్రశాంతంగా జరిగాయి. టెన్త్ ఇంగ్లీషు పరీక్షకు 9 కేంద్రాల్లో 164 మంది విద్యార్థులకు గాను 139 మంది హాజరయ్యారు. ఐదు కేంద్రాల్లో ఓపెన్ ఇంటర్ హిందీ, తెలుగు పరీక్షలకు 222 మంది విద్యార్థులకు గాను 204 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

వికలాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే పరిశీలనలో సమగ్రశిక్ష ఎపిసి చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ప్రభుత్వ అందిస్తున్న పథకాలను సద్వినియోపరుచుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె చంద్రశేఖరరావు సూచించారు. మంగళవారం మండలంలో వికలాంగ పిల్లల గుర్తింపునకు మండల సహిత విద్య ఉపాధ్యాయులు కలమట శ్రీనివాసరావు, ఐ.నాగమణి చేపడుతున్న సర్వేను సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఎపిఒ అప్పలనాయుడుతో కలిసి పరిశీలించారు. సర్వేపై తగు సూచనలు చేశారు.



వికలాంగ చిన్నారులతో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఎపిసి

ఈసందర్భంగా ఎపిసి మాట్లాడుతూ, నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో చేరే వికలాంగ బాలలకు మండల భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ తెరపి, ఎస్కార్ట్ ఎలివేషన్స్, ట్రాన్స్‌పోర్ట్ ఎలివేషన్స్ వంటి సేవలతోపాటు గుర్తింపు శిబిరాల ద్వారా అవసరమైన వారికి ఉపకరణాలు అందజేస్తారన్నారు. మానసిక వైకల్యమున్న పిల్లలు చదువుకొనుటకు కిట్స్ అందజేస్తారన్నారు. సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వం అందించే సౌకర్యాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

ఐదుగురు వికలాంగ చిన్నారుల గుర్తింపు

పద్మనాభం :సమగ్రశిక్ష పథక సంచాలకులు ఆదేశాల మేరకు వికలాంగ బాలల గుర్తింపు సర్వేలో ఇప్పటి వరకు మండలంలో ఐదుగురిని గుర్తించారు. 21 రకాల వైకల్యాలున్న 18ఏళ్లలోపు పిల్లల గుర్తింపు, బడిలో వారి పేర్ల నమోదులో భాగంగా మంగళవారం పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో ఇద్దరి చిన్నారులను గుర్తించారు. సర్వే ప్రక్రియను పరిశీలించిన సమగ్రశిక్ష ఎపిసి చంద్రశేఖరరావు మాట్లాడుతూ, వారిని బడిలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంఇఒ రమణను ఆదేశించారు. వికలాంగ బాలలకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రయోజనాలు, సౌకర్యాలను వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వచ్చేనెల 9 వరకు ప్రక్రియ కొనసాగించాలని ఎపిసి సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్.రాజ్‌కుమార్. ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని చందక గ్రామం కిరాణా షాపు వద్ద జరిగిన విద్యుత్‌షాక్ ప్రమాదంలో రెడ్డి దశ్వంత్ (14)విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే పిడుగుపాలెం దొంతలవారి కల్లాలలో ఏడేళ్ల క్రితం భీమవరం నుంచి వలస వచ్చిన రెడ్డి శివ, లక్ష్మి కుమారి దంపతులు, తమ ఇద్దరు కుమారులు దస్వంత్(14), సంజయ్‌తో నివాసముంటున్నారు.మంగళవారం ఉదయం 10గంటల సమయంలో చందక గ్రామంలో కిరాణా దుకాణంలో పనిచేస్తున్న మేనమామ బి.సాయి దగ్గరకు దశ్వంత్ వెళ్లాడు. దుకాణంలోని ఫ్రిజ్‌లోని వాటర్ బాటిల్ తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు. గమచించిని దశ్వంత్ మేనమామ సాయి, మృతుని తండ్రి శివకు సమాచారం అందించాడు. వారు కొమ్మాదిలోని గాయత్రి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే దశ్వంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుని. తండ్రి శివ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు ఆదేశాలతో ఎఎస్ఐ సత్తిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం హెరిటేజ్ కంపెనీ జంక్షన్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం.... బయ్యవరం హెరిటేజ్ కంపెనీ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఓ లారీ డ్రైవర్ రైట్ సైడ్ సిగ్నల్స్ ఇవ్వకుండా అకస్మాత్తుగా లారీని మలుపు తిప్పాడు. ఇదే సమయంలో ఆ మార్గంలో అనకాపల్లి వైపు నుండి యలమంచిలి వైపు వెళుతున్న కారు ఆ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో వెళుతున్న బుంగా వెంకట్ నరసమ్మ (72) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. నరేష్, సువర్ణలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామ శివారులో మంగళవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ పోలీసు సిబ్బందితో వడ్డాది జంక్షన్ సమీపంలో గల ఇటుక బట్టీల వద్ద పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో రూ.18,160 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రైతు బజారు ప్రారంభం

తగరపువలసలో రైతు బజారు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- తగరపువలస : రైతాంగం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం జివిఎంసి రెండో వార్డు గ్రంథాలయం వీధిలో రూ.78 లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించిన రైతు బజారును ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జెడ్‌సి బమ్మి అయ్యప్పనాయుడు, మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి సుధాకర్, ఉప సంచాలకులు జి శ్రీనివాస్ కిరణ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, ఇఇ టి రవి ప్రసాద్, డిఇఇ ఐ నారాయణ, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బి లక్ష్మీచైతన్య పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రాజేష్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : కొలతల్లో కచ్చితత్వం, సరైన తూకం పొందడానికి తూనికలు, కొలతలతోపాటు ధర, నాణ్యతలపైనా వినియోగదారులకు అవగాహన అవసరమని విశాఖపట్నం లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ జి రాజేష్ కుమార్, డిప్యూటీ కంట్రోలర్ కెటి రవికుమార్ సూచించారు. వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా స్థానిక పౌర గ్రంథాలయంలో తూనికలు, కొలతలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులోమాట్లాడుతూ, తూకం, కొలతలు, నాణ్యతలో వినియోగదారులు మోసపోకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్యాకేజీ రూపంలో ఉండే ఏ వస్తువుకైనా ఎంఆర్‌పి కంటే అధిక ధర వినియోగదారుడు చెల్లించిన అవసరం లేదన్నారు.

తూకం, కొలతల్లో ఎవరైనా మోసం చేస్తే సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం పొందవచ్చన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించి రశీదును పొందాలన్నారు. కార్యక్రమంలో విశాఖ కన్స్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం సత్యనారాయణ, ఆసరా ఫౌండేషన్ శత్రుఘ్నుడు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్లు పిడివి అప్పలరాజు (విశాఖపట్నం), బి రామచంద్రయ్య (అనకాపల్లి), పి చిన్నమ్మ (గాజువాక3), లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు రామారావు (విశాఖపట్నం సిటీ), ఎస్ ఉమాసుందరి (గాజువాక), సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీల సౌకర్యాలు, సేవలపై పరిశీలన

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం సందర్శించారు. సెంట్రల్ జైలులోని న్యాయ సహాయ కేంద్రాన్ని సందర్శించారు. ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయంపై సమీక్షించారు. ఖైదీలతో మాట్లాడి, వారి కేసుల వివరాలతోపాటు, జైలులో వారికి అందుతున్న సౌకర్యాలు, సేవలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులోని వివిధ బ్లాక్‌లను సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, జైల్లో పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, డిప్యూటీ సూపరెంటెండెంట్స్ ఎస్.సాయిప్రవీణ్, సిహెచ్.సూర్యకుమార్, జైలర్లు, సహాయ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రమేష్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 21న బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం, మూడవజోన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ, శివశక్తినగర్, ఆర్‌టిసి కాలనీ, నగరంపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబే కాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్ ,సాయిప్రియ లేఅవుట్, వల్లీనగర్, వుడా కాలనీ, ఎన్‌జిఒ కాలనీ మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

పెండింగ్ సమస్యల పరిష్కారంలో అలసత్వం

● రేపు గాజువాక జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

జివిఎంసి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెండింగ్ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు ఆందోళనకు సన్నద్ధంగా ఉండాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు పిలుపు ఇచ్చారు. మంగళవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద గాజువాక జోన్ అప్కాస్ వర్కర్స్ మిస్సింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసన తెలిపారు. నగరంలో మరే జోన్లలోనూ లేనివిధంగా గాజువాక జోన్‌లో 2022 నుండి నేటి వరకు 50 మంది కార్మికులకు ప్రతినెలా జీతాలు మిస్సవుతున్నాయన్నారు. సప్లమెంటరీ బిల్లు పెట్టడంలో జాప్యం, ప్రధాన కమిషనర్ లేకపోవడంతో నేటికీ ఈసమస్య పరిష్కారం కావడం లేదన్నారు..యూనియన్ గౌరవ అధ్యక్షులు పి. వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎఫ్.వన్ గుమస్తా, కంప్యూటర్ ఆపరేటర్ సరిగ్గా పనిచేయక పోవడం వల్లే గాజువాకజోన్‌లో కార్మికుల వేతనాలు మిస్సవుతున్నాయన్నారు. యూనియన్ గాజువాక జోన్ జనరల్ సెక్రెటరీ గొలగాని అప్పారావు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు రోజుకో కుంటిసాకు చెపుతున్నారన్నారు. దీనిపై ఈనెల 22న గురువారం ఉదయం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నాకుజోన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులు కదలి రావాలని పిలుపునిచ్చారు.

ఇంటర్న్‌షిప్‌తో కెరీర్ అవకాశాలు

● 23న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఉచిత వెబినార్

వెబినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయు రెక్టార్ కిశోర్‌బాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విద్యా కార్యక్రమాల్లో ఇంటర్న్‌షిప్ ముఖ్య ఘట్టమని ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం సరైన ఇంటర్న్‌షిప్, ప్రకాశవంతమైన భవిష్యత్తు వెబినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిగ్రీ ప్రోగ్రామ్ సమయంలో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు అధ్యయన రంగంలో ఆచరణాత్మక అనుభవాన్ని ఇస్తుందన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల గురించి స్పష్టమైన అవగాహనతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ మాట్లాడుతూ, మెరుగైన కెరీర్ అవకాశాలు, సరైన నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవడానికి విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడానికి ఈ వెబినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ 23న నిర్వహిస్తున్న ఉచిత వెబినార్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వెబ్‌నార్‌కు గాయత్రి విద్యా పరిషత్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కృష్ణకుమార్ ముఖ్య అతిథిగా, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో ట్రైనర్ అండ్ అనలిస్ట్ అనురాధ విన్నకోట స్పీకర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఈ వెబ్‌నార్‌లో పాల్గొనే వారు ఈ నెల 20 నుంచి 23 వరకు సాయంత్రం వరకు కంపెనీ వెబ్‌సైట్ https://www.millenniumsoftsol.com లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 92487 53099, 91540 84157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సలహాదారు కె.భవాని, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీలో కష్టించే వారికి తగిన గుర్తింపు

● టిడిపి మినీ మహానాడులో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మధురవాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతోనే తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, తాను చంద్రబాబు ప్రోడక్ట్ అని చెప్పుకోవడానికి గర్వపడతానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.టిడిపిలో కష్టించే వారికి ఎపుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మంగళవారం మధురవాడ వి కన్వెన్షన్‌లో భీమిలి నియోజకవర్గ టిడిపి మినీ మహానాడులో మాట్లాడుతూ, చంద్రబాబు విజన్, పాలనా సంస్కరణలు, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన తీరును దేశమంతా హర్షిస్తూ పొగుడుతోందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలంటే తనకు ఎంతో ఇష్టమని,పేదల సంక్షేమం, . మహిళలకు ఆస్తి హక్కు, సమాన అవకాశాలు కల్పించిన యుగపురుషుడని కీర్తించారు. ప్రపంచంలోనే కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాజకీయ పార్టీ టిడిపి అన్నారు. అత్యధిక మెజారిటీ ఇచ్చిన భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. యువ నాయకుడు గంటా రవితేజ మాట్లాడుతూభీమిలికి రానున్న టిసిఎస్, గూగుల్, అదానీ వంటి ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థల్లో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రాధాన్యమివ్వాలని ఐటిమంత్రి లోకేష్‌ను కోరారు. పార్టీ పరిశీలకులు, డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ లక్షకు మించిన సభ్యత్వాలతో తెలుగు దేశానికి భీమిలి కంచుకోటని మరోమారు నిరూపితమైం దన్నారు. కార్యక్రమంలో ఆరవ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, పివి.నరసింహం, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, గంటా అప్పలకొండ, లొడగల అప్పా రావు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, కోరాడ రమణ, జీవన్‌కుమార్, గాడు అప్పల నాయుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన నేతలు

పద్మనాభం: మధురవాడలో నిర్వహించే భీమిలి నియోజకవర్గ టిడిపి మినీమహానాడుకు మండలంలోని పలు గ్రామాల నుండి 100 మంది కార్యకర్తలు వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యంలో రేవిడి గ్రామపంచాయతీ కేంద్రానికి అంతా చేరుకుని, అక్కడి తగరపువలస, ఆనందపురం భోగిపాలెం మీదుగా మధురవాడ చేరుకున్నారు. మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, మండల యూత్ అధ్యక్షులు కెవి. సత్యనారాయణ ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

నేటి నుంచి గ్రేడ్ -2 హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలోని గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల బదిలీ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు, బదిలీ కోరువారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

రజత పతక విజేతకు అభినందన

ప్రజాశక్తి- సీతమ్మధార :బీహార్ రాష్ట్రం రాజ్‌గిరి లో ఈనెల 10నుంచి 15 వరకు జరిగిన ఖేలో ఇండియా యూత్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 81కిలోల కేటగిరీలో రజత పతకం సాధించిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ, బిఎ ఫస్టియర్ విద్యార్థి ఎం తరుణ్‌ను మంగళవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి మధుకుమార్ అభినందించారు. తరుణ్ మరింత రాణించి, మున్ముందు మరెన్నో పతకాలను సాధించి భవిష్యత్‌ను బంగారుమయంగా తీర్చిదిద్దు కోవాలని ఆకాంక్షించారు. తరుణ్‌ను అభినందించిన వారిలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి దీపక్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వర్ రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై శ్రీనివాసరావు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మారెడ్డి ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్, యువనేత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలం గిడిజాల గ్రామంలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన మంటలు చెలరేగి, మూడిళ్లలోని సామాన్లు, నిత్యావసర వస్తువులు సర్వం కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, యువ నాయకుడు కోరాడ వైకుంఠం అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రమాద కారణాలను, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబీకులకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు అలాగే నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు అందజేశారు. అధికారులతో మాట్లాడి బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయం శిరోధార్యం

ప్రజాశక్తి- సీతమ్మధార: కూటమిగా ముందుకు వెళుతున్న పరిస్థితుల్లో పార్టీ నిర్ణయాలు, ఆదేశాలను శిరోధార్యంగా భావిస్తూనే, మిత్రపక్షాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనసేన విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జివిఎంసి డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశబాబు, సుందరపు విజయకుమార్, జనసేన కార్పొరేటర్లు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణన్ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ పదవికి పార్టీ అధిష్టానం నలుగురి పేర్లను పరిశీలించి, వారిలో ఇద్దరిని ఫైనల్‌చేసి, ఒకరిని ఎంపికచేసి గోవిందరెడ్డి పేరును షీల్డ్ కవర్‌లో పంపించిందన్నారు.దీనికి అందరూ ఆమోదించి, పార్టీ ఐక్యతకు, బలోపేతానికి కృషి చేయాలన్నారు. దక్షిణ నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేయగా, అందరూ శు భాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యునిగా నియమితులైన 39వ వార్డు పార్టీ అధ్యక్షుడు మైలపల్లి శ్రీనును సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఉపఎన్నికకు జివిఎంసికి బయలుదేరి వెళ్లారు.

నిర్వాసితులకు అండగా సిపిఎం

లోవపాలెం గ్రామస్తులకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం భరోసా

ప్రజాశక్తి-రాంబిల్లి

ఎస్ఇజెడ్‌ల పేరుతో భూ సేకరణలో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు సిపిఎం ఎల్లప్పుడు అండగా ఉంటుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. మండలంలోని జెడ్.చింతవా పంచాయతీ, లోవపాలెం గ్రామంలో లోకనాథం నేతృత్వంలో సిపిఎం బృందం పర్యటించింది. పార్టీ నాయకులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. "ఎస్ఈజెడ్ కంపెనీల కోసం మా గ్రామం పోతుందని, అధికారులు తమ ఇళ్లకు నెంబర్లు వేస్తున్నారు. గ్రామాన్ని ఎక్కడికి తరలిస్తారో, ఎంత ప్యాకేజీ ఇస్తారో, ఎటువంటి ఉపాధి కల్పిస్తారో, మా జీవితాలకు గ్యారెంటీ ఏమిటో అధికారులు ఏమీ చెప్పలేదు" అని స్థానిక మహిళలు సిపిఎం నాయకులు ముందు తమ గోడు వెల్లబుచ్చారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఎస్ఈజెడ్‌కు భూ సేకరణ చేపడితే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం, నివాసానికి ఉపయోగకరంగా ఉన్న పునరావాస కాలనీ, మేజర్ కుమారులు, కుమార్తెలకు ఐదు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు నష్టపరిహారం కూడా ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగి ఉన్న యువతీ, యువకులకు ఈ కంపెనీల్లో ఉపాధి కల్పించాలని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా వారికి పని నైపుణ్యం పెంచి పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించాలని చెప్పారు. అప్పటివరకు మీరు ఎక్కడికి పోనవసరం లేదని, మిమ్మల్ని ఎవరైనా బలవంతంగా తరలించాలని చూస్తే సిపిఎం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శంకర్రావు, రాంబిల్లి మండలం కార్యదర్శి జి దేవుడు నాయుడు, కమిటీ సభ్యులు వై రాము, నిర్వాసిత మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

లోవపాలెం మహిళలతో మాట్లాడుతున్న లోకనాథం

బాబీని పూలమాలతో సత్కరిస్తున్న నాయకులు

టిడిపి మండల అధ్యక్షునిగా బాబీ ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడుగా సీనియర్ నాయకులు కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబీ) మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన రాజకీయ ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగింది. తుమ్మపాల సర్పంచ్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పదవులతో పాటు పార్టీలో పలు పదవులు ఆయన గతంలో చేపట్టారు. బాబీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో అంకిత భావంతో పనిచేస్తున్నారు. బాబీ టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్న వారికి తప్పకుండా పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, బత్తుల తాతయ్యబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే టిడిపి మండల ఉపాధ్యక్షులుగా దాడి పెంటారావు, ప్రధాన కార్యదర్శిగా నంబారి శ్రీను, కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర్ రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన అనకాపల్లి విచ్చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి విజయా రెసిడెన్సీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెక్కెర కర్మాగారాల దయనీయ స్థితికి కూటమి ప్రభుత్వ అలసత్వమే నిదర్శనమని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారన్నారు. జిల్లాలో నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా నిర్వహించలేకన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ గిడ్డంగులు నిర్మించకపోవడం వలన రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. అనంతరం జిల్లా నాయకులందరూ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర్ రావుకు అమ్మవారి ఫోటో ఫ్రేమ్ ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వర్‌రావు, అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల, పాయకారావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ కోఆర్డినేటర్లు మలపురెడ్డి కోటేశ్వరరావు, తనకాల అనంతరావు, పడాల కొండలరావు, మారుతి చక్రవర్తి, కచ్చాల చిన్నబాబు, జిల్లా అసంఘటిత రంగ, ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ విన్నకోట రాము, కాంగ్రెస్ నాయకులు ఆది మూర్తి, కాళ్ళ సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, సూరా శ్రీనివాస్, తుట్టా రమణ, బోయిన భాను మూర్తి యాదవ్, సేనాపతి రాజు, చక్ర ధర్, మొర్తా సింహాచలం, ఆర్ ఆర్ నాయుడు, ఉమ్మిడి గోవింద్, ఎం.గంగరాజు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల సమస్యలపై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో నడుస్తున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం ఒక రోజు సమ్మె చేపట్టారు. దీనిలో భాగంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సిఐటియు ఆఫీస్ నుండి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకూ నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు మాట్లాడుతూ పదేళ్లుగా పని చేస్తున్న కెప్టెన్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారం పట్ల అరబిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 4 నెలల నుంచి జీతాలు లేక ఉద్యోగులందరూ అలమటిస్తున్నా కనీసం పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, ఇంక్రిమెంట్లు, పని ఒత్తిడి తదితర డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులు చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగరావు, శ్రీను, కెప్టెన్లు పాల్గొన్నారు.

విశాఖలో ఆందోళన చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు బి.రాజులు, వై.సతీష్ మాట్లాడుతూ చట్ట ప్రకారం అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వేతనం రూ.18,500 చెల్లించాల్సి ఉన్నప్పటికీ రూ.7870 మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. ఇస్తున్న ఆ కొద్దిపాటి వేతనాన్ని కూడా నాలుగు నెలలుగా చెల్లించలేదని వారు ఆవేదన వెలిబుచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరబిందో సంస్థ చేస్తున్న వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఏపీఈపీడీసీఎల్ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, రాజాం సర్పంచ్ మరిసా నాని ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజాం గ్రామంలోనూ అక్రమ కట్టడాలకు, స్థానిక వై జంక్షన్లో వాణిజ్య కట్టడాలకు పంచాయతీ ఎన్ఓసి, ఇంటి పన్ను రసీదులు లేకుండానే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాజాం పంచాయితీలో ఇటీవల కొత్తగా మంజూరు చేసిన విద్యుత్ కనెక్షన్లపై విచారణ చేయాలని కోరారు. స్థానిక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామానికి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, దీంతో వేసవిలో వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మళ్ళాం, ఆర్.బీమవరం, ఆర్.శివరాంపురం ఫీడర్లకు కలపడంతో తమ గ్రామానికి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఫారం-3 దరఖాస్తులలో భారీ అవినీతి జరుగుతుందన్నారు. ఈ విషయంపై వడ్డాది సబ్ స్టేషన్ ఏఈ రాజును వివరణ కోరగా గ్రామ పంచాయతీ నుండి ఎన్వోసీ, పన్ను రసీదు లేకుండా కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు. దీనిపై విచారణ చేసి నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్లు మంజూరు చేస్తే వాటిని రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏఈ చెప్పారు.

ఎజిఎల్ సర్వీసుల విద్యుత్ సరఫరా మెరుగుపరచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామీణ ప్రాంతంలో రైతులకు ఎంతో ఉపయోగపడే ఏజీఎల్ సర్వీస్‌లలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఏపీఈపీడీసీఎల్ అధికారులను కోరారు. ఈ మేరకు ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేఖర్‌తో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా కొణతాల మాట్లాడుతూ వినియోగదారులు సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి డిఎస్‌పి మోహన్‌రావు

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలో సంచలనం కలిగించిన ఉగ్గినిపాలెంలో జరిగిన హత్య కేసు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను అనకాపల్లి ఇన్‌చార్జ్ డిఎస్‌పి బి.మోహన్‌రావు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పక్కుర్తి అప్పలనాయుడు,ఓమ్మి నూకరాజు ఇరు కుటుంబాలు కలిసి పెంచుతున్న సుమారు 300 గొర్రెల పంపకంపై గతంలో నుంచే వారి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం యలమంచిలి ప్రాంతం నుండి ఊరికి వస్తూ గొర్రెలను వేరు చేయడం గురించి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో నూకరాజు, ఆయన కుమారుడు ఓమ్మి శ్రీనులు అప్పలనాయుడు కుమారులు పక్కుర్తి అప్పారావు, పక్కుర్తి రాజుపై దాడి చేశారు. అదే రోజు సాయంత్రం అప్పలనాయుడు ఆయన ఇంటి వైపు వచ్చిన ఓమ్మి నూకరాజు, శ్రీనును, తమ కుమారులపై జరిగిన దాడి విషయమై ప్రశ్నించగా, ఓమ్మి నూకరాజు, శ్రీను ఇద్దరూ కర్రలతో అప్పలనాయుడు తలపై, శరీరంపై దాడి చేసి, కాళ్లతో తొక్కి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన అప్పలనాయుడును కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు చెప్పారు విచారణలో ఓమ్మి శ్రీను, తన తండ్రితో కలిసి ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన విషయాన్ని ఒప్పుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు డిఎస్‌పి తెలిపారు. 24 గంటలలో ముద్దాయిలను అరెస్టు చెయ్యడంలో కీలక పాత్ర వహించిన దర్యాప్తు అధికారి సిఐ అల్లు స్వామినాయుడు , ఎస్ఐలు బి. లక్ష్మణరావు, పి మనోజ్ కుమార్‌లను, కశింకోట పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

మర్లమాంబకు రవికుమార్ పూజలు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి పెదనాయుడుపాలెం గ్రామ దేవత శ్రీమర్లమాంబ అమ్మవారి మారువారం పండుగ మహోత్సవం సందర్భంగా ఆలయం కమిటీ పెద్దలు ఆహ్వానం మేరకు వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సబ్బవరం పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పాల సంఘం అధ్యక్షులు సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి), మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ సబ్బవరపు నాగభూషణం, వార్డ్ సభ్యులు గొర్లి శ్రీను, బోకం రామకృష్ణ, సబ్బవరపు శివ, చిత్రాడ శ్రీను, సబ్బవరపు నాగేంద్ర, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, బోకం గణేష్, బోకం సాయికృష్ణ, దాకవరపు శ్రీను, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరు వానలో సిహెచ్ఒల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఓ)ల సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం జోరువానలోనూ తమ నిరసన కొనసాగించారు. దీక్షా శిబిరంలో 23వ రోజు దీక్షలను కొనసాగించారు. అనకాపల్లి డీసీఎంఎస్ కార్యాలయం వద్ద జోరు వానలో సైతం తమ నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసనను తెలియజేశారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తాము సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఇన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్నా, ఏపిఎంలు మూతపడివున్నా, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు అధికారులు కనీసం పట్టించుకోకపోవడం, తమను చర్చలకు ఆహ్వానించకపోవడం అత్యంత ఆవేదన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ నిరసనలో సిహెచ్ఓలు జి.భవాని, జి.యమున, కె అశ్విని, టి కళ్యాణి, ఆర్. అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సిహెచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిహెచ్ఒలు

4న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పాటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పద్మవిభూషణ్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా జూన్ 4న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీ పాటల పోటీలు యలమంచిలి, గుర్రప్ప కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాన్ని మంగళవారం స్థానిక సిద్ధార్థ అసోసియేషన్ వినరాజుపేట కార్యాలయంలో జరిగిన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న ఉదయం 8 గంటల నుండి ఉత్సవకమిటీ నిర్వాహకులు మత్తుర్తి రామారావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని, అన్ని వయస్సుల స్త్రీ, పురుషులు, పిల్లలు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ రుసుము రూ.100 అని, అందరికీ మధ్యాహ్నం భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గాయని మణి డాక్టర్ కుమారి అపర్ణ, బెన్నాబత్తుల ఆనందరావు, ఎస్‌పి.బాలు కమిటీ సభ్యులు ఆడారి అప్పారావు, సిద్ధార్థ అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, నందేల అప్పారావు, ఊడా నాగేశ్వరరావు, ఏవి. రమణమూర్తి పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు కాటపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. జిల్లాలోని నక్కపల్లి మండలం దొండవాడలో ఎనిమిది మంది దళిత యువకుల్ని చోరీకి పాల్పడ్డారన్న నెపంతో విచక్షణారహితంగా కొట్టి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, మచ్చ రామారావు, కన్నాబత్తుల రాజు, పల్లా సంతోష్, మచ్చ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్‌ఒ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నెలవారీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో, ఎన్నికల ప్రక్రియ పారదర్శక నిర్వహణలో రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరినీ ఓటర్లుగా చేర్చుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలేజీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, కాలేజీల ప్రిన్సిపాల్ ద్వారా కాలేజీలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా చేర్చాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, టిడిపి ప్రతినిధి బి. శ్రీనివాసరావు, బి.జె.పి. ప్రతినిధి పి.నాగేశ్వరరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, ఐఎన్‌సి ప్రతినిధి కె.వి.సత్యనారాయణ, సి.పి.ఎం.ప్రతినిధి జి.శ్రీరామ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు 80 మందిని పరీక్షించారు. వీరిలో 30 మంది శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. 20 మందికి కళ్లద్దాలు సూచన చేయగా మరో 15 మందికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు డాక్టర్ సురేష్, స్వాప్న అమల, కోఆర్డినేటర్ సతీష్, రాజా ఆప్టికల్స్ అండ్ ఆసుపత్రి నిర్వాహకులు పూసర్ల రాజా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

పార్టీ కేడర్‌కు విలువివ్వని అధికారులను సాగనంపాలి

- యలమంచిలి మినీ మహానాడులో ఏకగ్రీవ తీర్మానం
- అభివృద్ధి పనుల్లో ఒంటెద్దు పోకడలపై అసంతృప్తి

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం వృద్ధికి అడ్డుపడుతున్న రాజకీయ శక్తుల్ని గట్టిగా ఎదుర్కోవాలని, పార్టీ కేడర్‌కు విలువివ్వని అధికార యంత్రాంగాన్ని ఇక్కడ నుండి సాగనంపాలని యలమంచిలి నియోజకవర్గం మినీ మహానాడు ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక గుర్రప్ప కల్యాణమండపంలో మంగళవారం జరిగిన మినీ మహానాడుకు అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు మాట్లాడుతూ కార్యకర్తల అభీష్టం మేరకే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. కూటమి ధర్మం ప్రకారం జనసేన అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇచ్చి 50వేలు మెజార్టీతో గెలిపించడం జరిగిందని, కాని నేడు టిడిపి కార్యకర్తలు పూర్తి అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. వీటిని మంత్రి వంగలపూడి అనిత, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తెచ్చి కడపలో జరిగే మహానాడులో తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో నిష్పత్తి ప్రకారం కేటాయించిన నిధులతో చేపట్టిన పనులు ఒంటెద్దు పోకడగా జరుగుతుండడం పట్ల పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ మరో తీర్మానం చేశారు. నియోజకవర్గంలో గ్రామస్థాయి వివోఓల నుంచి కలెక్టర్ స్థాయి వరకూ, పోలీసు యంత్రాంగం సైతం విలువివ్వడం లేదని వాపోయారు. కంపెనీల్లో కాంట్రాక్టు పనులన్నీ వైసిపి నేతల బినామీలు చక్కబెడుతుండడం ఆపాలని తీర్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రాజాన రమేష్‌కుమార్, కర్రి సాయికృష్ణ, ఇత్తంశెట్టి నాయుడు, కొలకులూరి విజయబాబు, ఆడారి మంజు, దొక్కా నాగభూషణం, పెంటకోట విజయ్, ధూళి రంగనాయకులు, గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు

నేడు పెందుర్తి మినీ మహానాడు

సబ్బవరం : టిడిపి పెందుర్తి నియోజకవర్గం మినీ మహానాడు మండలంలోని ఇరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గండి బాబ్జి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటీసీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కోడూరు భూ పరిహారంపై విచారణ చేపట్టాలి

సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కోడూరు సర్వే నెంబర్ 20లో 31.38 ఎకరాలకు రూ.20 లక్షలు చొప్పున చెల్లించిన భూపరిహారంపై బహిరంగ విచారణ చేపట్టాలని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిహారం చెల్లింపులో అక్రమాలకు పాల్పడిన వారిపైనా, సహకరించిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి, జమ చేసిన నగదును తిరిగి రాబట్టాలని డిమాండ్ చేశారు. బినామీలను సాగుదార్లుగా నమోదు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పరిహారం చెల్లింపు అక్రమాలపై రెవెన్యూ అధికారులు, అధికార, ప్రతిపక్ష పార్టీ ఏకమై ఈ కుంభకోణం చేశారని తెలిపారు. దీనిపై టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతి, అక్రమాల్లో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు బి.ఉమామహేశ్వ రావు, అల్లు రాజు, కాళ్ళ తేలయ్యబాబు పాల్గొన్నారు.

వివరాలు నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులంతా తమ భూమి వివరాలతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయంలో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆన్లైన్ లో నమోదు చేయబడిన రైతుల వివరాలు సరైనవా కావా అని ఆయా రెవెన్యూ గ్రామాల్లో ఉన్న రైతు సేవ అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. కావున రైతులందరూ తమ భూమి పాసుపుస్తకం వన్ బి రికార్డు ఆధారు రేషన్ కార్డు ఫోన్ నెంబర్‌తో ఆయా సచివాలయాల్లోని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ వరహాలు దొర, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి-కశింకోట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా పారదర్శకంగా సర్వే చేపట్టాలని అనకాపల్లి డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ (డిడిఓ) ఎస్.మంజులవాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే జరగాలన్నారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతిఒక్కరూ ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని సూచించారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వంగలపూడి రవి కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ ఎం. వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్పి కార్యాలయం ప్రాంగణంలో గల ఇవిఎం గొడౌనును జిల్లా రెవిన్యూ అధికారి, ఉప జిల్లా ఎన్నికల అధికారి వై.సత్యనారాయణరావు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం తనిఖీ చేసారు. నెలవారీ తనిఖీలలో భాగంగా ఇవిఎం మెషీన్లను భద్రపరచిన గొడౌను సీళ్లను, సిసి. కెమెరాలు, అగ్నిమాపక పరికరాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఇంఛార్జి రెవిన్యూ డివిజనల్ అధికారి వై.శ్రీనివాసరావు, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, టిడిపి ప్రతినిధి బి.శ్రీనివాసరావు, బి.జె.పి. ప్రతినిధి పి.నాగేశ్వరరావు, ఆప్ ప్రతినిధి కె.హరినాధబాబు, ఐఎన్‌సి ప్రతినిధి కె.వి.సత్యనారాయణ, సి.పి.ఎం.ప్రతినిధి జి.శ్రీరామ్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అనకాపల్లి రింగురోడ్ జంక్షన్ వద్ద అంగరంగ వైభవంగా జరిపారు. ముందుగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జూనియర్ ఎన్టీఆర్ పేరు మీద గోత్రనామములతో అభిషేకం జరిపించారు. తరువాత రింగురోడ్ జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ కేక్ కటింగ్ చేశారు. మధ్యాహ్నం సుమారు 2000 మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు, ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు సూరిశెట్టి రమణ కుమార్, బుద్ద జగదీష్ గాంధీ, అల్లు సురేష్, కరణం సర్వేశ్వరరావు, సరగడం శంకర్ (కటక్), కోయిలాడ ఈశ్వర్, బొడ్డేడ గిరీష్, దాడి అప్పారావు, ఉలింగల సంతోష్, సతీష్, సురేష్ అభిమానులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, మద్దాల భీమేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు పళ్ళు పంపిణీ

అనకాపల్లి రూరల్ : నటులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం పట్టణ బాలకృష్ణ ఫాన్స్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సంయుక్తంగా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు, సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధి కరణం శ్రీనివాసరావు, కొణతాల బాబురావు, విల్లూరి అప్పలనాయుడు, మద్దాల భీమేష్, బొడ్డేడ గిరీష్, ఈశ్వర్, మోహన్, సతీష్, చందు, రవి, బుద్ద కాశి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆగస్టు 15 నుండి చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 15 నుంచి 22 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అఖిలభారత చిరంజీవి ఫ్రాన్స్ ఉపాధ్యక్షులు గల్లా కొండలరావు తెలిపారు. ఒక హోటల్లో మంగళవారం ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రితో కలిసి చిరంజీవి జన్మదిన వారోత్సవాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా ఒక్కొక్క రోజు ఒక్కొక్క సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చిరంజీవి ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు శ్రీరామదాసు గోవిందరావు, మళ్ల శ్రీను, కొణతాల శ్రీను, కొమ్మోజి రాజు, బొడ్డేడ శ్రీను, నగిరెడ్డి మధు, ఆకులేటి సతీష్, కాండ్రేగుల ప్రసాద్, గణేష్ వర్మ, కోయిలాడ గంగాధర్, కోడి పవన్, రామకోటి, కులుకూరి కుమార్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో హోరెత్తిన నిరసనలు

అనకాపల్లిలో నిరసన చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి.

అనకాపల్లి : నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లిలో ఆర్ఎఆర్ఎస్, ఆర్టీసీ డిపో, జీవిఎంసీ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ చాలా దుర్మార్గమైనవని, కార్మికులు పోరాడి సాధించిన హక్కుల్ని కాలరాస్తున్నాయని తెలిపారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఈ లేబర్ కోడ్స్‌ని తీసుకొచ్చినట్టు చెప్పారు. ఈ లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులకు ఏ హక్కులు అమలు ఉండవన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా జూలై 9న జరుగు సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, నందీశ్వరరావు, త్రిమూర్తులు, అజయ్, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

చోడవరం : దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసిల్దార్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1214 మెమోను రద్దు చేసి స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ, మిడ్డేమీల్స్, శానిటేషన్, ఆశా వర్కర్ల యూనియన్ల నాయకులు కొండమ్మ, ఎర్రయమ్మ, బి.లక్ష్మి, వరలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో రాంబిల్లి సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన పథక కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరవు పార్వతి, ప్రజానాట్యమండలి నాయకులు సంజీవరావు, అంగన్వాడీ, ఆశా, మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సీటీయూ కార్యాలయం నుండి మూడు రోడ్ల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గండి నాయుడు బాబు, అంగన్వాడీ, ఆశా, పంచాయతీ, ఐకెపి విఒఎ యూనియన్ల నాయకులు పి.భవాని, గట్ట నాగమణి, కె.దుర్గారావు,క్రి సత్యం పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది సెంటర్లో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, మనవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌వి.నాయుడు, అంగన్వాడీ, ఆశా, పంచాయతీ యూనియన్ల నాయకులు నీలవేణి, గిరిజ, యేసు రాజు, ముత్యాలు, శ్రీను పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు చేయాలని, ప్రమాదాల అరికట్టాలని, కార్మికులకు భద్రతా పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కరణం వెంకట్రావు, వెంకటస్వామి, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

రావికమతంలో...

యలమంచిలి : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని స్థానిక నెహ్రూనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, నాయకులు జానకి, వరలక్ష్మి, కొండయ్య, జ్యోతి, మణి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, అంగన్వాడి సంఘ అధ్యక్షురాలు వివి రమణమ్మ, సిఐటియు నాయకులు ఎం గౌరేష్, పి. కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, గౌరీ, దేవి పాల్గొన్నారు.

చీడికాడ:జూలై 9న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో మంగళవారం చీడికాడ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటిని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు.లేబర్ కోడ్స్ అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు, ఆ సమ్మె జయప్రదానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని దేవుడు నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నేతలు కామాక్షి, మంగ, అంగన్వాడి యూనియన్ అమ్మాజీ, ఉమా, పైడితల్లమ్మ, భారతి పాల్గొన్నారు.

చీడికాడలో..

భెల్ మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న నేతలు

రావికమతం : దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రావికమతం సిఐటియు మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి కోరారు. మండల కేంద్రంలో నిరసన కార్యక్రమంలో ఆటో, మురా, అసంఘటితరంగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను మానుకోవాలని ఆమె దుయ్యబట్టారు. లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని, స్కీం వర్కర్లు అందరికీ 26000 రూపాయలు కనీస వేతనం చెల్లించాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్మికులు ఎస్.లక్ష్మి .సంధ్య, లక్ష్మి, ముఠా కార్మికులు ఎం అప్పారావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక.: లేబర్ కోడ్స్ రద్దు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోరుతూ మంగళవారం భెల్ మెయిన్ గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం, నాలుగు లేబర్ కోడ్స్ రద్దుచేసి, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు, కనీస పింఛను రూ.9వేలు చెల్లించాలన్నారు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఎస్ సాహు మాట్లాడుతూ, కార్మికుల స్థానిక సమస్యలతోపాటు దేశవ్యాప్త సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని, జూలై 8న జాతీయసమ్మెకు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పివిఎన్ రాజు, సీతన్న నాయుడు, బోండా బాబురావు, కె.నారపరెడ్డి, వి ఆనందరావు, సిహెచ్ మురళీశ్వరరావు, కె రామునాయుడు, అల్లు అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీపై గ్రామ సభలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హులు జాబితాను నర్సీపట్నం ఆర్డీఓ వీవీ రమణ వెల్లడించారు. మంగళవారం తహసిల్దార్ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో వేంపాడు, రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, డి.ఎల్.పురం గ్రామాలలో గ్రామ సభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హులు జాబితాను ప్రకటించారు. నిర్వాసితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏకధాటిగా వర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయితీ కొర్రగూడ, కంజరితోట గ్రామాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని సిపిఎం పంచాయితీ నాయకులు కె సుబ్బారావు, పీసా కార్యదర్శి కె దేవన్న డిమాండ్ చేశారు. మంగళవారం కొర్రగూడ, కంజరితోట గ్రామాల్లో పర్యటించి తాగునీరు సౌకర్యం కల్పించాలని నూతనంగా ఏర్పాటు చేసిన బోరు వద్ద మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. కొర్రగూడ గ్రామంలో సుమారు 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. మంచినీరు లేక ఊటగెడ్డ బురదనీరే ఆధారంగా మారిందన్నారు. వర్షాకాలం బురద నీరు తాగుతూ అనేక రోగాలకు గురి అవుతున్నారన్నారు. గతంలో అనేకసార్లు తాగు నీరు సౌకర్యం కల్పించాలని ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.

అన్ని విధాలుగా నర్సీపట్నం అభివృద్ధికి కృషి

-టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ -ఘనంగా మినీ మహానాడు

మాట్లాడుతున్న విజయ్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నంలో తెదేపా మినీ మహానాడు పండుగ వైభవంగా మంగళవారం జరిగింది. పలు కీలక అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తీర్మానించామని తెలిపారు. చిన్నతనం నుంచి తెదేపా జెండాను చూసి పెరిగిన తాము, చివరి శ్వాస వరకు కూడా అదే పార్టీలో ఉంటామని విజయ్ వెల్లడించారు. నర్సీపట్నం అభివృద్ధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పది నెలల వ్యవధిలో 117 కోట్ల రూపాయలు నిధులను నియోజకవర్గానికి తీసుకు రాగలిగారని తెలిపారు.విద్య, వైద్య, మౌలిక వసతుల కల్పనలో నర్సీపట్నాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు.గత పాలనలో లిక్కర్‌లో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. పార్టీకి నిస్వార్థంగా సేవ చేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలిపారు.

అనకాపల్లి జిల్లా తెదేపా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలు ఉన్న నియోజకవర్గం నర్సీపట్నమేనని పేర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 50,000కు పైగా సభ్యత్వాలను నమోదు చేశామని చెప్పారు. . ఈ కార్యక్రమంలో 26వ వార్డ్ కౌన్సిలర్ రాజేష్, కాశీనాయుడు, మండల అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, ఎర్రపాత్రుడు, అడిగర్ల అప్పలనాయుడు, లాలం శ్రీరంగ స్వామి పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి

కోటవురట్ల: ఈనెల 22న రాయవరం మండలంలో జరగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యకర్తలతో పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడు మాట్లాడుతూ, ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, శ్రేణులు, నాయకులు హాజరు కావాలని తెలిపారు. లింగన్న నాయుడు మాట్లాడుతూ, మహానాడు కార్యక్రమానికి 1500 మందిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, టిడిపి సీనియర్ నాయకులు జనార్దన్, జానకి శ్రీను, శెట్టి విశ్వనాథం, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, పి సూర్యారావు, బాబ్జి సుంకర, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న గ్రామస్తులు

సుజల స్రవంతి సర్వే పనుల అడ్డగింత

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో తోటకూరపాలెం గ్రామంలో ప్రారంభించబోయే సుజల స్రవంతి పథకం సర్వే పనులను తోటకూర పాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామ ప్రజలందరితో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్, ఆర్డిఓలు వచ్చి ప్రజలతో నిర్ణయించుకున్న నిర్ణయాలను, రాతపూర్వకంగా రాసి ఇచ్చిననాడే పనులకు అనుమతి ఇస్తామని,లేని పక్షంలో ఎక్కడ ఎటువంటి పనులు చేపట్టడానికి వీలులేదని గ్రామస్తులందరూ ముక్తకంఠంతో తేల్చిచెపాపద్రు.ఈ పథకం ద్వారా తాము సర్వం పోగొట్టుకుంటున్న తమకు న్యాయం జరిగే వరకూ పనులను ప్రారంభించడానికి వీలులేదని వారు హెచ్చరించారు. తమ పంట భూములు, గ్రామం, ఇల్లులు, మొత్తం పూర్తిగా సుజల స్రవంతి డ్యాములో పోయే పరిస్థితి ఉన్నందున తమ గ్రామానికి ప్రభుత్వం, అధికారులు తమకు న్యాయం చేసిన పిమ్మటే పనులను ప్రారంభించాలన్నారు.

తహసీల్దార్ బి. వెంకటరమణ తాము సుజల స్రవంతి పథకానికి సంబంధించి గ్రామాన్ని, భూములను పరిశీలించడానికి మాత్రమే రావడం జరిగిందని, తదుపరి జిల్లా ఉన్నతాధికారులు వచ్చి ప్రజలందరితో సమావేశమయ్యి తగు నిర్ణయాలు తీసుకున్న తర్వాతనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. దీంతో సచివాలయం ముందు గ్రామస్తులు నిరసన చేపట్టారు. సుమారు 6000 జనాభా కలిగిన గ్రామస్తులందరూ ఎక్కడ తలదాచుకోవాలని ప్రశ్నించారు.ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో రెవిన్యూ సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితిలో వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నేతలు

ఆంధ్ర కేసరికి ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగు టూరి ప్రకాశం పంతులు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబొడ్డేపల్లి ట్యాంక్ బండ్ వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు ఏకా శివ మాట్లాడుతూ, టంగుటూరి తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ తమరాన శ్రీనివాస్, లీగల్ సెల్ అధ్యక్షులు మాకిరెడ్డి బుల్లి దొర, సీనియర్ నాయకులు పెట్ల నాయుడు, బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి కేసులో విచారణ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో డొంకాడలో దళిత యువకులపై అగ్రవర్ణాలు దాడి కేసుకు సంబంధించి నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. దాడి కేసుకు సంబంధించి బాధితుడు స్వర్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం స్థానిక సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబులతో కలిసి గ్రామానికి చేరుకుని, విచారణ చేపట్టారు.దాడి జరిగిన ప్రాంతంలో దాడికి కారణం,ఎలా జరిగింది, ఎవరు చేశారో, తదితర వివరాలను దాడికి గురైన బాధితులను అడిగి తెలుసుకుని వివరాలను నమోదు చేశారు. విచారణ మొత్తం వీడియో చిత్రీకరణ చేపట్టారు.అనంతరం డొంకాడ ఎస్సీ కాలనీని సందర్శించారు. కాలనీకి చెందిన దళితులు, దళిత సంఘ నాయకులు దాడి జరిగిన తీరు ,ఇతర విషయాలను డి ఎస్ పి దృష్టికి తీసుకువెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను డీఎస్పీ ఓదార్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.ఏసు, నాసా సంస్థ ప్రతినిధులు శ్రీను, శాంతి కుమారి, కూరపాటి అప్పారావు,ఈది కన్నా రావు , నొక్కి శివ,బీరా రమణ, నొక్కి అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

సత్తిబాబు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

-ద్వితీయ వర్ధంతి సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్

సమసమాజ స్థాపనే లక్ష్యంగా, పేదలు, కార్మికుల సమస్యలపై సిఐటియు నాయకులు డి.సత్తిబాబు తన జీవితాంతం పోరాటం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. అమరజీవి కామ్రేడ్ డి.సత్తిబాబు ద్వితీయ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం జరిగింది. ముందుగా సత్తిబాబు చిత్ర పటానికి కోటేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి, కుటుంబ సభ్యులు డి.అమర్, ఎల్.గౌరి, ఆర్‌కె.నాయుడు, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అధ్యక్షతన జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ సత్తిబాబు సిఐటియు, సిపిఎం నాయకుడుగా సుమారు 40 సంవత్సరాల పాటు పని చేసి నర్సీపట్నంలో చెరగని ముద్ర వేశారని తెలిపారు. ముఠా, మున్సిపల్, కాఫీ, బిల్డింగ్, అంగన్‌వాడీ, ఆశా, మీడ్డేమీల్ ఇలా ఎన్నో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారి సమస్యలపై ఉద్యమాలు నడిపారని పేర్కొన్నారు. అందుకే నర్సీపట్నంలో సిపిఎం, సిఐటియు నాయకుడంటే ప్రతి ఒక్కరిలో సత్తిబాబు గుర్తుకొస్తారన్నారు. సిపిఎం నాయకునిగా దళిత, గిరిజన భూ సమస్యలపైనా, పేదలకు ఇళ్ళ స్థలాల కోసం, నర్సీపట్నం మున్సిపాలిటీలో సమస్యలపైనా పని చేశారని గుర్తు చేశారు. సిపిఎం, పలు ప్రజా సంఘాలను నిర్మించడంలో సత్తిబాబు కృషి మరువలేనిదన్నారు. జెవివి నేత త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితోనే సత్తిబాబు పని చేశారని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు ఎం.చిట్టియ్య మాట్లాడుతూ కామ్రేడ్ సత్తిబాబు సంఘాల ప్రాధాన్యతను తనను తెలియజేసి, యుటిఎఫ్‌లో పని చేయాలని ప్రోత్సహించారని తెలిపారు. ప్రజాశక్తి సబ్ ఎడిటర్ ఆర్కే నాయుడు మాట్లాడుతూ సత్తిబాబు చివరి శ్వాస వరకు పార్టీ సిద్ధాంతం, ఆశయాల కోసం పని చేశారని, పార్టీ ఆశయ బాటలోనే కుటుంబాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆర్.రమణమ్మ, వి.సామ్రాజ్యం వరలక్ష్మి, ఆశా నాయకులు అరుణ, మిడ్డేమీల్స్ నాయకులు కె.ప్రసన్న, ఐద్వా నాయకులు కెవి సూర్యప్రభ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ముఠా, మున్సిపల్, స్కీమ్‌వర్కర్స్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

సత్తిబాబు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న కోటేశ్వరరావు, నాయకులు

కేబినెట్ సమావేశంలో

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్‌పై ప్రస్తావనేదీ ?

ప్రజాశక్తి- అరకు లోయ: మే 20 తేదీన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆదివాసుల వంద శాతం రిజర్వేషన్ ఉద్యోగ ఉపాధ్యాయ నియామక చట్టం పై కనీసం ప్రస్తావన చెయ్యక పోవడం అన్యాయమనీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి గతుం బుచ్చిబాబులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ నియామకాలు, మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించి ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ ఇవ్వాలని ఆదివాసులు ఆందోళ చేస్తున్నా రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చ లేకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమ శాఖ సమీక్ష సందర్భంగా మూడు అఫ్సన్లు పరిశీలిస్తున్నట్లు ప్రకటించారని, ఆ దిశగా చర్యలు లేకపోవడం ఆదివాసులకు అన్యాయం చేయడమేనన్నారు. ఆదివాసులకు న్యాయం జరగాలంటే ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహించాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నా క్యాబినెట్ సమావేశంలో ఎటువంటి చర్యలు తీసుకోక పోవడాన్ని దుర్మార్గమన్నారు. డీఎస్సీ దరఖాస్తు గడువు ముగిసిన ప్రభుత్వం జోక్యం చేసుకోలేదని మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహించి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ట్రస్ట్ ద్వారా పాఠశాలలకు నిధులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కమిటీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌కు నిధులు కేటాయించి వారికి పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ చైర్పర్సన్ - కం మేనేజింగ్ ట్రస్టీ అధ్యక్షతన జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కమిటీ మొదటి సమావేశం జరిగిందిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు కమిటీ వెంటనే ఏర్పాటు చేసి ప్రతిపాదించాలని కన్వీనర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎం. ఆనంద్‌ను ఆదేశించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ నిధుల నుండి జిల్లాలో ఉన్న సుమారు 250 ఆశ్రమ పాఠశాలలకు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ కు అవసరమైన స్టవ్ లు కొనుగోలుకు రూ.50 లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో విద్యార్థుల భవిష్యత్తు మెరుగుకు 8,9,10 తరగతుల విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి సుమారు రూ.1.50 కోట్లతో మెల్బోర్న్ విశ్వ విద్యాలయంతో టయప్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిలా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎం. ఆనంద్, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు ఎస్ఎస్ బి నంద్, ఎం. నరశింహులు, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీ రావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, పంచాయతి అధికారి పి.ఎస్ కుమార్ పాల్గొన్నారు.